ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 19.04.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. 562 కోట్ల రూపాయల పెట్టుబడితో జపాన్ సంస్థ తోషిబా ట్రాన్స్ మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ సంగారెడ్డి జిల్లా రుద్రారంలో ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.
2. రానున్న రెండు నెలల్లో 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.
3. పేదల వైద్యభారాన్ని తగ్గించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డయగ్నోస్టిక్స్ కేంద్రాలను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిన్న కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పసుపు హెచ్చరిక జారీ చేసింది.

-------------------

**సీఎం-జపాన్ టూర్**

జపాన్ కు చెందిన తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ అయిన, తోషిబా ట్రాన్స్ మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ) 562 కోట్ల రూపాయల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా రుద్రారంలో కొత్త ఫ్యాక్టరీని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులను, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ ఒప్పందం ద్వారా ముందడుగు

వేసింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టీటీడీఐ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఫురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. అదే విధంగా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్ గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించేందుకు ఇప్పటికే ఉన్న ఫ్యాక్టరీలను ఆధునీకరించనుంది.

యాడ్-సీఎం

అంతకుముందు డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్, ఐటీ సేవల్లో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన NTT DATA Group Corporation, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత క్లౌడ్ ప్లాట్ ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్ సంయుక్తంగా హైదరాబాద్ లో కృత్రిమ మేధ- ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి 10 వేల 500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ను నిర్మించేందుకుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది.

డెస్క్

---------------------

ఉద్యోగాల భర్తీ-మంత్రి దామోదర

రాష్ట్రంలో ఇప్పటికే 50 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని రానున్న రెండు నెలల్లో మరో 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుతో పాటు భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. 15 నెలల ప్రజా పాలనలో ప్రజల

కోసం అవసరమైన ప్రతీ పనిని చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి మొదటి దశలో 3500 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు.

**(సంగారెడ్డి పీటీసీ)**

---------------------

**మహబూబాబాద్ -భూ భారతి**

భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో భూభారతి చట్టంపై ఈ రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రైతుల కోసం ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని అన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కస్తామని తెలిపారు.

**( మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి)**

--------------------

**ఎస్సెల్బీసీ టన్నెల్- టీబీఎం బేరింగ్ మిషన్**

నల్లగొండ జిల్లాలో వివిధ కారణాలతో ఏళ్ల తరబడిగా నిలిచిపోయిన ఎస్సెల్బీసీ సొరంగ మార్గం పనులను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా వైపు నుంచి నిర్మిస్తున్న టన్నెల్ 2 వద్ద బోరింగ్ మిషన్ బేరింగ్ లు రెండేళ్ల క్రితం చెడిపోయాయి. నిలిచిపోయిన టన్నెల్ పను లను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం టీబీఎం బెరింగును తెప్పించింది. చెన్నై పోర్టు నుంచి నిన్న రాత్రి మన్నెవారిపల్లి అవుట్లెట్ వద్దకు చేరుకున్న బేరింగ్ ల ను యంత్రానికి అమర్చి పనులు ప్రారంభించేందుకు మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**( పిటిసి నల్లగొండ జిల్లా)**

--------------------------

**ఆసిఫాబాద్ - కలెక్టర్**

రాష్ట్రం ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని ఎవరైనా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే హెచ్చరించారు. జిల్లాలో 317 రేషన్ దుకాణాలలో సన్నబియ్యం పంపిణీ కొనసాగుతోందని వీటిని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**(బైట్ -ఆసిఫాబాద్ కలెక్టర్)**

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

------------------------

**డయగ్నోస్టిక్స్ కేంద్రాలు-కేటీఆర్**

రాష్ట్రంలో పేదల వైద్యభారాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత రోగ నిర్ధారణ కేంద్రాలు-డయగ్నోస్టిక్స్ సెంటర్లు లక్ష్యానికి భిన్నంగా పనిచేస్తుండటంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండగా, మరికొన్ని కేంద్రాల్లో 134 రకాల రోగ నిర్ధారణ పరీక్షల్లో కేవలం 30 నుంచి 40 పరీక్షలకే పరిమితం అవడం దారితప్పిన ప్రభుత్వ వైద్యరంగానికి సంకేతమని విమర్శించారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఖరీదైన పరికరాలు నిరుపయోగంగా మారడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి మహోన్నత లక్ష్యంతో మొదలుపెట్టిన డయగ్నోస్టిక్స్ సెంటర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

(డెస్క్)

--------------------

**వర్షాలు-పంట నష్టం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిన్న కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన వర్షానికి చేతికి వచ్చిన వరిపైళ్లు నేలవాలగా.. మామిడి పళ్లు

నేలరాగలా ఇతర పంటలకు కూడా నష్టం వాటిల్లింది. హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునిగి ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై నీళ్లు నిలవడంతో హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు,మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హనమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. అలాగే, రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

**(డెస్క్)**

----------------------

**జనగామ-పిడుగు పాటు**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపురం గ్రామ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిన్న సాయంత్రం పిడుగు పడిన ఘటనలో 12 మంది రైతులు గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన రైతులను జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు సహాయంతో పాటు మెరుగైన చికిత్స కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**( పిటిసి, జనగామ జిల్లా)**

----------------------

**వర్షాలు సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిన్న కురిసిన వడగళ్ల వర్షానికి ఇల్లంతకుంట, రుద్రంగి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతినగా, నువ్వు పంట నేల వాలింది. మామిడికాయలు నేల రాలాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈరోజు ఉదయం నుంచి ఆయా గ్రామాలలో వ్యవసాయశాఖ అధికారులు పర్యటిస్తూ వంట నష్టం అంచనా వేస్తున్నారు.

**(పి టిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

----------------------

**పోషణ పక్షోత్సవాలు- కరీంనగర్**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోషణ పక్షోత్సవాల్లో పోషణ జాతర, అన్న ప్రాసన, శ్రీమంతాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**( బైట్ సబిత జిల్లా అధికారి )**

**(పిటిసి, కరీంనగర్)**

----------------------

**తాండూరు భద్రేశ్వర రథోత్సవం**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రసిద్ధి క్షేత్రం శ్రీ భద్రేశ్వర జాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుక ఈ అర్ధరాత్రి జరగనుంది. సాయంత్రం కలశదారణ చేయనున్నారు. భారీ సంఖ్యలో భక్తులు, పలువురు ప్రజాప్రతినిధులు వస్తుండటంతో పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది.

(పీటీసీ, వికారాబాద్ జిల్లా)

----------------------

**సంగారెడ్డి జాతర**

సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్ మండలంలోనీ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ వీరభద్రేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నిన్న రాత్రి ప్రత్యేక పూజలు చేసి, స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో  భక్తులు  పాల్గొన్నారు. ఈ జాతర ఈనెల 22 వరకు జరగనుంది.

**(SANGAREDDY PTC)**

---------------------------